క్లుప్తంగా

ఓటరు నమోదు చేపట్టాలి

జఫర్‌గఢ్: బీఎల్‌ఓలు ఇంటింటా తిరిగి ఓటర్ లిస్టులో నమోదు కాని ఓటరులను చేర్పించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటర్ నమోదుపై బీఎల్ఓలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఆర్డీఓ సందర్శించి మాట్లాడారు. ఓటర్ల నమోదు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని అన్నారు. తహసీల్దార్ శంకరయ్య, డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌బాబుతో పాటు బీఎల్ఓలు పాల్గొన్నారు. అలాగే ఆర్డీఓ వెంకన్న కస్తూర్బా, తిమ్మంపేట పాఠశాలలను సందర్శించి వంటలతో పాటు వసతి సౌకర్యాలు, విద్యాబోధనను పరిశీలించారు.

'పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే లేబర్ కోడ్‌లు'



మాట్లాడుతున్న విజేందర్

జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే లేబర్ కోడ్‌లను అమలుచేస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికవర్గాల హక్కులను కాలరాస్తుందన్నారు. ఈ మేరకు ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కోశాధికారి అన్న బోయిన రాజు, జిల్లా కమిటీ సభ్యుడు బూడిద ప్రశాంత్, భావన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్, నాగరాజు, బాలరాజు ఉన్నారు.

పాపన్న కోటను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న రంజిత్‌యాదవ్

రఘునాథపల్లి: బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న కోట బీటలు బారుతుందని, వెంటనే పునరుద్ధరించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఉడుత రంజిత్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఖిలాషాపూర్ పాపన్న కోటను ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. పాపన్న కోటకు గత ప్రభుత్వాలు కోట్ల నిధులు మంజూరు చేసినా మరమ్మతు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడంతో కోట దెబ్బతింటుందన్నారు. గోల్కొండ కోటను ఏలిన చరిత్ర పాపన్నదని, ఆ మహనీయుడు నిర్మించిన కోటను కాంగ్రెస్ ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. పార్టీ బూత్ అధ్యక్షుడు తాడూరి అజయ్, దుడక సాయి తేజ, జిట్టె విష్ణు, కట్ల అరుణ్ పాల్గొన్నారు.


శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న సీఐ అబ్బయ్య

బచ్చన్నపేట: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ముసుకు అబ్బయ్య హెచ్చరించారు. శుక్రవారం పోచన్నపేట గ్రామంలో గ్రామస్తులకు మాదకద్రవ్యాలు, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల క్రయ, విక్రయం, వినియోగం నేరమని తెలిపారు. ఎస్సై ఎస్కె అబ్దుల్ హబీబ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో చిన్నపెండ్యాల కళాకారుల ప్రదర్శన



చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన గజవెళ్లి మంజునాథ్ బృందం శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో చిందు యక్షగాన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఉదయం లకిడీకాపూల్‌లో మాజీ సీఎం రోశయ్య జయంతి సందర్భంగా, అనంతరం రవీంద్రభారతిలో సీఎం, మంత్రుల సమక్షంలో చిందు యక్షగాన కళా ప్రదర్శన ఇచ్చినట్లు తెలిపారు.

ప్రమాదకరంగా ఎండిన చెట్టు

- తొలగించాలని కోరుతున్న ప్రజలు

కొడకండ్ల: మండలంలోని రామవరం బస్టాండ్ వద్ద రోడ్డు పక్కన ఎండిపోయిన చెట్టు ప్రమాదకరంగా ఉంది. గత కొద్ది కాలంగా కొడకండ్ల–మొండ్రాయి ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే రామవరం బస్టాండ్ వద్ద ఎండిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్నా కూడా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎండిపోయిన చెట్టు పక్కనే బస్‌షెల్టర్ ఉండడంతో నిత్యం ప్రయాణికులు బస్సులు, ఆటోల కోసం వేచి చూస్తుంటారు. ఎండిన చెట్టు ఎప్పుడు కూలుతుందో అన్న భయంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ సేదదీరుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో ఈదురు గాలులు, వర్షాలకు చెట్టు కూలి ప్రమాదం చోటు చేసుకొనే అవకాశం ఉందని, ప్రమాదం చోటుచేసుకొక ముందే సంబంధిత అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



బస్టాండ్ వద్ద ప్రమాదకరంగా ఉన్న ఎండిన చెట్టు

శాకంబరీ అలంకరణలో విజయ దుర్గామాత



జనగామ: వారాహి నవ రాత్రులను పురస్కరించుకుని శుక్రవారం చివరి రోజు జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంట విజయ దుర్గా ఆలయంలో అమ్మవారు శాంకబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన పూజారి ఆరాధ్య శర్మ మంత్రోచ్చరణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఆయా వార్డుల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పిట్టల సత్యం, ప్రధాన కార్యదర్శి వాంకుడోతు అనిత, ప్రభాకర్, కుక్క సావు అంజన్న, అనిల్, వెంకన్న, అరుణ్ గౌడ్, లక్ష్మి, యాదగిరి, పార్వతి పాల్గొన్నారు.

రూట్ మ్యాప్ తెచ్చిన ప్రమాదం

- నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి గుంతలో పడిన కారు
- పలువురికి గాయాలు
- మహారాష్ట్ర నుంచి తిరుపతికి వెళ్తున్న భక్తులు

జనగామ రూరల్: రూట్‌మ్యాప్ ఆధారంగా మహారాష్ట్ర నుంచి తిరుపతికి వెళ్తున్న కారు నిర్మాణంలో ఉన్న గుంతలో పడ్డ ఘటన జనగామలోని హుస్నాబాద్ రోడ్డు గానుగుపహాడ్ క్రాస్ వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. కారులోని ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన అయిదుగురు సెల్‌ఫోన్‌లో రూట్ మ్యాప్ ఆధారంగా తిరుపతికి కారులో వెళ్తున్నారు. గానుగుపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద ఒక్కసారిగా నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి గుంతలో కారు బోల్తా పడడంతో కారులోని కేత్రి, దీప్, అశీష్, మహమ్మూద్, ప్రమోద్‌లకు గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



గుంతలో పడిన కారు

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..

గత రెండేళ్ల క్రితం గానుగుపహాడ్ క్రాస్ వద్ద గల బ్రిడ్జి భారీ వర్షాలతో కొట్టుకుపోగా నూతన బ్రిడ్జి నిర్మాణానికి పనులు ప్రారంభించారు. పనులు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ ఏడాది నుంచి పనులు నిలిపివేశారు. గతంలో రెండుసార్లు వర్షాలకు తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోగా మళ్లీ కంకర పోసి రోడ్డుపై మట్టి పోశారు. ఇలా ప్రమాదాలు జరుగుతున్నా.. ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జల సంరక్షణ అందరి బాధ్యత



స్టేషన్‌ఘన్‌పూర్: ఇంకుడు గుంత నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ వెంకన్న

- ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: జల సంరక్షణయే జన సంరక్షణయని, ప్రతీ వర్షపునీటి బొట్టును ఒడిసి పట్టేందుకు అందరూ బాధ్యతగా పాటుపడాలని ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. మన జిల్లా–మన నీరు కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమాన్ని ఆర్డీఓ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఆర్‌డీఓ కార్యాలయంలో ఉమ్మడి ఏపీ మాజీ సీఎం రోశయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీఏఓ క్రాంతికుమార్, డీటీ సునంద, ఉపేందర్, శ్రీనివాస్, శ్రీప్రియ, సుష్మ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

చిల్పూరు: నీరు నిలిచే ప్రాంతాల్లో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని మండల ప్రత్యేకాధికారి మాధవీలత అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మన జిల్లా–మన నీరు పథకం కింద నీరు నిలిచే చోట నిర్మిస్తున్న ఇంకుడు గుంత పనులను శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. కార్యదర్శి అజీజ్‌పాషా, హెచ్‌ఎం శ్రీనివాస్, సింగపురం సింగపురం కిరణ్ కుమార్, సునీత టీఏ కుమారస్వామి తదితరులు ఉన్నారు.

వర్షపు చుక్కను ఒడిసి పటాలి

నర్మెట: జీవకోటి మనుగడకు నీరు ప్రధానమని.. ప్రతీ వర్షపు చుక్కను ఒడిసి పట్టాలని నర్మెట గ్రామ పంచాయతీ కార్యదర్శి కందకట్ల శ్రీధర్ అన్నారు. పంచాయతీ ఆవరణలో ఇంకుడు గుంత నిర్మాణానికి ముగ్గు పోసి శుక్రవారం పూర్తి చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బిల్ కలెక్టర్, ఎండీ ఖాజా, సిబ్బంది భాస్కర్, ఉప్పలయ్య, నాగమణి పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి



జనగామ: దొడ్డి కొముర్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కురుమ సంఘ నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో..



జఫర్‌గఢ్: నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా దొడ్డి కొమురయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ బాధ్యతగా పాటుపడాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో కురుమసంఘం, జీఎంపీఎస్, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పీరీల ఊరేగింపు



నర్మెట: పీరీలను ఊరేగిస్తున్న యువకులు

రఘునాథపల్లి/పాలకుర్తిటౌన్/బచ్చన్నపేట/నర్మెట: గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం పలు గ్రామాల్లో డప్పుచప్పుళ్ల మధ్య పీరీలను ఊరేగించారు. కులమతాలకతీతంగా పీరీల వద్దకు భక్తులు చేరుకొని భక్తిశ్రద్ధలతో కుడుక, ఊదు, బెల్లంతో మొక్కులు తీర్చుకున్నారు. పీరీలతో యువకులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి, దీంతో అయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

మాజీ సీఎం రోశయ్య జయంతి

పాలకుర్తి టౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని శుక్రవారం మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి గ్రంథాయల సిబ్బంది, పాఠకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమ్మగాని శ్రవణ్‌కుమార్‌గౌడ్, చిట్యాల మధు, అక్కినపల్లి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



డీసీసీ కార్యాలయం నుంచి హైదరాబాద్ వెళ్తున్న నాయకులు

జనగామ: సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా జరిగే బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానుండగా, జనగామ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పాలన సాగుతుందన్నారు. జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, నాయకులు గంగం నరసింహారెడ్డి, చెంచారపు బుచ్చిరెడ్డి, లింగాల నర్సిరెడ్డి, యాదగిరిగౌడ్, రాజబోయిన లక్ష్మీనారాయణ, వంగాల మల్లారెడ్డి, నామాల శ్రీనివాస్, బస్సీ నాయక్, బక్క శ్రీనివాస్ ఉన్నారు. అలాగే బచ్చన్నపేట, కొడకండ్ల, రఘునాథపల్లి, పాలకుర్తి మండలాల నుంచి పలువురు నాయకులు బహిరంగ సభకు తరలివెళ్లారు.

గోరింటాకు సంబురం



గోరింటాకు వేడుకలను జరుపుకుంటున్న మాజీ మహిళా కౌన్సిలర్లు

ఆషాఢ మాసం పురస్కరించుకుని జనగామ పట్టణంలోని మాజీ కౌన్సిలర్ వాంకుడోతు అనిత స్వగృహంలో శుక్రవారం జరిగిన గోరింటాకు వేడుకల్లో మాజీ మహిళా కౌన్సిలర్లు పాల్గొన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను చాటి చెబుతూ చేతులకు గోరింటాకు పెట్టుకుని సంబురాలను జరుపుకున్నారు.

-జనగామ

రక్తదాన శిబిరం



డాక్టర్ సుగుణాకర్‌రాజును సత్కరిస్తున్న ప్రముఖులు

జనగామ: ప్రముఖ ప్రభుత్వ డాక్టర్, ప్రజా వైద్యులు సుగుణాకర్‌రాజు జన్మదినం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని కోటిరత్నం ఆస్పత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. హన్మకొండ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు డాక్టర్ కిషన్ ఆధ్వర్యంలో రక్తం సేకరించగా, లయన్స్ క్లబ్‌లు, స్వచ్ఛంద సంస్థలు, మాజీ ప్రజా ప్రతినిధులు, సినీ రంగ ప్రముఖులు తదితరులు డాక్టర్ సుగుణాకర్ రాజును శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను అందించి కేక్‌కట్ చేశారు. అంతకు ముందు ఆయన చంపక్‌హిల్స్ అతిథి ఆర్ఫన్ హౌస్‌లో చిన్నారుల మధ్య జన్మదిన వేడుకలను జరుపుకుని అన్నదానం చేశారు. ఇందులో పట్టణంలోని 13వ వార్డుకు చెందిన మల్లిగారు రాజు 94వ సారి రక్తదానం చేశారు. కార్యక్రమంలో కన్నా పరశురాములు, కారంపూడి సతీష్, భిక్షపతి, వెంకటేష్, పజ్జూరి లక్ష్మీ నరసయ్య, గ ండి నాగరాజు, గ్రీన్ హోప్ సొసైటీ అధ్యక్షురాలు దూసరి ధనలక్ష్మి, జగదీష్, అశోక్ ఉన్నారు.

విద్యార్థులకు డైరీల బహూకరణ



విద్యార్థులకు డైరీలు అందజేస్తున్న క్రాంతికుమార్

రఘునాథపల్లి: జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు బొనాసి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఆయన స్వగ్రామం మండలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డైరీలను బహూకరించారు. పాఠశాలలోని 91 మంది విద్యార్థులకు డైరీలను పంపిణీ చేయడం పట్ల ఉపాధ్యాయులు క్రాంతికుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు ద్యాగల రాజశేఖర్, మండల యూత్ అధ్యక్షుడు మంగు రామకృష్ణ, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ

బచ్చన్నపేట/జనగామ రూరల్/రఘునాథపల్లి: ఇటీవల చికిత్స అనంతరం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పలు మండలాల బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. త్వరగా కోలుకుని నియోజక వర్గ అభివృద్ధికి పాటుపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, మహమ్మద్ యాకూబ్‌పాషా ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని జనగామ దర్గాలో ప్రార్థన నిర్వహించి ఊదు అందజేశారు. పలు మండలాల నాయకులు ఇమ్మడి జితేందర్ రెడ్డి, కాపర్తి హరిప్రసాద్, యాదండ్ల భాస్కర్, మాజీ ఎంపీపీ వై కుమార్‌గౌడ్, ముసిపట్ల విజయ్, చింతల బాలకృష్ణ, ఝెడ్ల బాలరాజు, అంజనేయులు, మహ్మద్ ఆజాం, అక్బర్, ఇమ్రాన్, రియాజ్, సుధాకర్, రాహుల్ వెంకన్న, నాగరాజు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి..

జఫర్‌గఢ్: సాగరం, కూనూర్ గ్రామాల్లో మృతి చెందిన పిన్నింటి రాజమ్మ, ఇల్లందుల నర్సయ్య కుటుంబాలతో పాటు తిమ్మాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన చిక్కుడు రాజమ్మ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పార్టీ బృందంతో కలిసి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు.

స్థానిక అవసరాలకే ఇసుక అనుమతులు కేటాయించాలి

దేవరుప్పుల: వాగు పరివాహక ప్రాంతాల్లో భూగర్భజలాలు పెంపుదలకు విఘాతం కల్పించకుండా స్థానిక అవసరాలకు ఇసుక అనుమతులు కేటాయించాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్ రామిరెడ్డి, సీనియర్ నాయకుడు బస్వ మల్లేషమ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కామారెడ్డిగూడెం వాగు నుంచి ఇసుక ఇతర మండలాలకు తరలిస్తుండగా చింత సోమయ్య ఆధ్వర్యంలో స్థానికులు అడ్డుకున్నారు. ఈ విషయమై సమాచారం అందుకున్న జనగామ ఆర్డీఓ గోపిరామ్, తహసీల్దార్ ఆండాళ్ వెళ్లి ఇందిరమ్మ ఇళ్లకు సహకరించాలని సూచించడంతో శాంతించారు.

అంజయ్య మృతి తీరని లోటు

దేవరుప్పుల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏసీ రెడ్డి కాలం నుంచి నేటి వరకూ అలుపెరుగని పోరాటాలు చేపట్టిన సీనియర్ నాయకుడు చిన్న అంజన్న మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. శుక్రవారం


సంక్షిప్తంగా

నీర్మాలకు చెందిన వడ్లకొండ చిన అంజయ్య అనారోగ్యంతో మృతి చెందగా కనకారెడ్డితోపాటు బీఆర్‌ఎస్, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల నాయకులు పూలమాల వేసి ఘననివాళులర్పించారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: కొన్నె గ్రామానికి చెందిన యాట వెంకటేశం అనారోగ్యంతో సిద్దిపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, సామాజిక కార్యకర్త కోడూరు శివకుమార్ గౌడ్ బాధితుడిని శుక్రవారం పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేల సాయం అందజేశారు. తేలు శ్రీనివాస్ ఉన్నారు.

కూలిన మర్రిచెట్టు తొలగింపు



పాలకుర్తి: మల్లంపల్లి నుంచి వావిలాలకు వెళ్లే రహదారిపై శుక్రవారం రోడ్డుకు అడ్డంగా మర్రిచెట్టు కూలిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్సై దూలం పవన్‌కుమార్, లింగారెడ్డి రెండు పొక్లెయినర్లతో రోడ్డుపై కూలిన మర్రి చెట్టును తొలిగింపజేశారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్యారేజ్ బాక్స్ అందజేత

జనగామ రూరల్: అమ్మ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్నదానం చేసేందుకు క్యారేజ్ బాక్స్‌ను మర్యాల అశోక్, గజ్జి మధు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా క్యారేజ్ బాక్స్ అందజేసినందుకు అశోక్‌కు అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజు కృతజ్ఞత తెలిపారు. నరేష్, వినోద్, నరసింహులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లకు 11వ తేదీ చివరి గడువు

తరిగొప్పుల: తెలంగాణ ఓపెన్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల చివరి గడువు ఈనెల 11తో ముగియనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి నెల్లుట్ల జానకి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల ఇంటర్ విద్యను ఒక సంవత్సరంలో పూర్తిచేయడం జరుగుతుందన్నారు. పరీక్షలు ఏప్రిల్, మే నెలలో జరుగుతాయని తెలిపారు. సీఈసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ, ఎంపీసీ, బైపీసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ 9441770748 నంబరును సంప్రదించవలసిందిగా ఆమె తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బాల్నే వెంకట మల్లయ్య డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 1,2 వార్డులను సందర్శించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శాఖ కార్యదర్శులు ముసిపట్ల జయ, తేరా అండాలు, ఏనుగుల కమల, కల్లెపు జ్యోతి, రాములు, పాల్ రాజు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

బచ్చన్నపేట: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రామానుజచారి, నాయిబ్ తహసీల్దార్ శంకర్‌ను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

ఉద్యమ కారుడికి మాజీ ఎమ్మెల్యే నివాళి

రఘునాథపల్లి: వెల్ది గ్రామానికి చెందిన ఉద్యమ కారుడు పెండ్లి వెంకట్‌రెడ్డి (62) శుక్రవారం అనారోగ్యంతో మరణించాడు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి వెల్ది గ్రామానికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక

జనగామ రూరల్: ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీకి జనగామ పట్టణానికి చెందిన మేదారం రుచిక ఎంపికైంది. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఇటీవల పదో తరగతి పరీక్షల్లో 565 మార్కులు సాధించింది. మెరిట్ ప్రకారం బాసరలో సీటు రావడం పట్ల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

చిల్పూరు: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో రూ.70 వేల విలువైన పాడి గేదె మృతి చెందిన సంఘటన దేశాయితండా పంచాయతీ పరిధిలోని సీత తండాలో శుక్రవారం జరిగింది. బాధిత రైతు భూక్య విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే ఉదయం పాడి గేదెలను మేతకు వదిలాడు. మేత మేసుకుంటూ వెళ్లిన పాడిగేదె విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్టు వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

దయాకర్‌రావు జన్మదిన వేడుకలు



దేవరుప్పుల: వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు



పాలకుర్తి టౌన్: కేక్ కట్ చేస్తున్న నాయకులు

దేవరుప్పుల/పాలకుర్తి టౌన్/కొడకండ్ల: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పుట్టిన రోజు వేడుకలను బుధవారం దేవరుప్పుల, పాలకుర్తి, కొడకండ్ల మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న సునీల్

బచ్చన్నపేట: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలకు మాదిగ, మాదిగ ఉపకులాలు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జ్ బోడ సునీల్ మాదిగ అన్నారు. గోపాల్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ దిమ్మెకు శంకుస్థాపన, బేడ బుడిగె జంగాల కమిటీ ఏర్పాటు కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మాట్లాడారు. మందకృష్ణ మాదిగ అలుపెరగని సుదీర్ఘ పోరాటం ఫలితంగానే వర్గీకరణ సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో బేడబుడిగె సంఘం మండల అధ్యక్షుడు సిరుపాటి రామదాసు, స్టేట్ యూత్ అధ్యక్షుడు చింతకరుణాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత ఉప్పలయ్య, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్, అధికార ప్రతినిధి సందెన రవీదర్, కార్యదర్శి పాకాల కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

కొడకండ్ల: మండలంలోని ఏడునూతుల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుక్క ప్రవీణ్ తనవంతుగా చేయూతనందించారు. పాఠశాలలోని 110 మంది విద్యార్థులకు సొంత డబ్బులు రూ.40 వేలు వెచ్చించి టై, బెల్ట్‌లు, షూను శుక్రవారం పంపిణీ చేశారు. విద్యార్థులకు చేయూత అందించిన హెచ్‌ఎంను తల్లిదండ్రులు, స్థానికులు అభినందించారు. ఏపీపీ చైర్మన్ ఖాజాబీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టై, బెల్ట్‌లు, షూ అందుకున్న విద్యార్థులు